నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం
11 ఫిబ్రవరి
2026

కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో
గులాబీ జెండా ఎగరడం ఖాయం

మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెం, ఫిబ్రవరి10(నినాదం) : కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్‌గా అవతరించిన తర్వాత తొలిసారి జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం--పాల్వంచ--సుజాతనగర్ పట్టణాలు కలిపి ఏర్పడిన ఈ కార్పొరేషన్‌లో ప్రజలు మరోసారి గులాబీ జెండాకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచే బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కొత్తగూడెంలో మకాం వేసి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో 60 డివిజన్లలో రెండుసార్లు విస్తృత ప్రచారం నిర్వహించారని తెలిపారు. ఇతర పార్టీలతో పోల్చితే బీఆర్ఎస్ ప్రచారం ప్రజల మధ్య విశేష స్పందన పొందిందని, ఎంపీ రవిచంద్ర పలు డివిజన్లలో కాలినడకన ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను స్వయంగా కలిసిన తీరు ప్రజలను ఆకట్టుకుందని సీతాలక్ష్మి తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేస్తూనే, కాంగ్రెస్ ఇచ్చిన 432 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ప్రజలు బాగా గ్రహించారని ఆమె అన్నారు.

రాష్ట్రం నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 16 మంది లోకసభ సభ్యులు ఉన్నా కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందని, ఆ అంశంపై ఎంపీ వద్దిరాజు పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్ పెట్టినా ఒక్క కాంగ్రెస్ ఎంపీ కూడా మద్దతు ఇవ్వలేదని ఆమె గుర్తు చేశారు.

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు స్వలాభ రాజకీయాలకే పరిమితమయ్యారని సీతాలక్ష్మి ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా తప్పుడు కేసులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల ప్రచారానికి ప్రజల్లో సానుకూల స్పందన స్పష్టంగా కనిపిస్తోందని, ఈ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని కాపు సీతాలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడడం తథ్యమని ఆమె స్పష్టం చేశారు.

సార్వత్రిక సమ్మెతో.. సంఘటితంగా పోరాటం చేద్దాం

ఇప్టు జాతీయ కన్వీనర్ షేక్షావలి

జవహర్ నగర్, ఫిబ్రవరి 10: సార్వత్రిక సమ్మెతో సంఘటితంగా పోరాటంచేద్దామని, అన్ని వర్గాల సంఘాలు, రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదుర్మార్గపు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని ఇప్టు జాతీయ కన్వీనర్ షేక్షావలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేబర్ కోడ్లతో కార్మికులజీవితాలు కార్పొరేట్ కబందహస్తాల్లో నలిగిపోతాయని, వ్యవసాయ రంగాన్ని భ్రష్టు చేసేందుకు ప్రయత్నం చేస్తున్న కేంద్రాన్ని ఎండగడుదామని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగపరిశ్రమ పరిరక్షణ, కనీస వేతనాల పెంపుదలకు ఉద్యమించాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. మనువాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

16,17,న గద్వాలలో సీఎం కప్
2025 26 జిల్లా స్థాయి క్రీడలు

జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి యం,కృష్ణయ్య

గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 10(నినాదం) : జిల్లాలో సీఎం కప్ 2025-26 జిల్లా స్థాయి క్రీడలు గద్వాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించబడనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి ఎం.కృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్,ఆదేశాల మేరకు,జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) నర్సింగ్ రావు పర్యవేక్షణలో గద్వాల ఇండోర్ స్టేడియంలో వివిధ క్రీడా పోటీలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. 2025--26 జిల్లా స్థాయి క్రీడలు జోగులాంబ గద్వాల జిల్లాలో ఫిబ్రవరి 12-13 16--17 తేదీలలో నిర్వహించబడనున్నట్లు తెలిపారు. మండలాల నుండి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు తప్పనిసరిగా పాల్గొనేలా ఎంపీడీఓ , తహసీల్దార్లు ,ఏం.ఈ.ఓ లు,సీజీఎఫ్ సెక్రటరీలు,మండల క్రీడా కన్వీనర్లు,పీడీలు, పీ.ఈ.టీలు,కేజీబీవి /గురుకుల్ పి.ఈ.టీ లు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9885479896, 9959344234, 9381890539 సంప్రదించాలన్నారు. క్రీడాకారులు, అధికారులు మరియు సంబంధిత విభాగాలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ సభ ముందు పనుల నివేదిక

రాంనగర్‌లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 (నినాదం) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల ంలోని రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. సామాజిక తనిఖీ అనంతరం మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ దప్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం పనుల వివరాలను గ్రామసభ ముందు ఉంచింది. గత సంవత్సరంలో గ్రామంలో సుమారు రూ.23 లక్షల విలువైన పనులు నిర్వహించినట్లు తెలిపారు. చేపట్టిన

పనులు పారదర్శకంగా నిర్వహించినట్లు తమ పరిశీలనలోకి వచ్చిందని, ప్రజాధనం దుర్వినియోగం కాలేదని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణలో క్షేత్ర సహాయకులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధితో పాటు ఉపాధి కూలీలకు పని దొరికేలా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని గ్రామసభలో నిర్ణయించారు. భవిష్యత్తులో కూడా ఉపాధి హామీ పనులు నాణ్యతతో, పారదర్శకంగా చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, ఏపీవో కుమారస్వామి, టెక్నికల్ అసిస్టెంట్ రవి, పంచాయతీ కార్యదర్శి సందీప్, ఉప సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు నూనె తిరుమల, పార్నంది ఆంజనేయులు, మిట్టపల్లి అపర్ణ, సయ్యద్ గోరే, కళ్యాణి, బిల్ కలెక్టర్ బోనగిరి పోచయ్యతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయం, గ్రామ పంచాయతీ
కార్యాలయ పరిసరాలు శుభ్రం

సిద్దిపేట ఫిబ్రవరి10(నినాదం): ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ సిద్దిపేట ఎన్.ఎస్.ఎస్ యూనిట్ రాఘవపురం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో నాలుగో రోజున, ఎన్.ఎస్.ఎస్ స్వచ్ఛంద సేవకులు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గ్రామ గ్రంథాలయం గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రత, పారిశుధ్యం పట్ల అవగాహన పెంచడమే కాకుండా, ప్రజా స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. బాలకిషన్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు

ఉపాధి హామీ పనులకు శ్రీకారం...

వంగర గ్రామంలో పనులు ప్రారంభించిన సర్పంచ్ గజ్జల సృజన రమేష్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 (నినాదం) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలు, కూలీలకు ఆర్థిక భరోసా కల్పించే అత్యంత ముఖ్యమైన పథకమని తెలిపారు. గ్రామంలోని ప్రతి అర్హుడైన ఉపాధి కూలీకి పని దొరికేలా చర్యలు తీసుకుంటామని, వంద రోజుల ఉపాధి లక్ష్యాన్ని చేరుకునే దిశగా గ్రామపంచాయతీ కృషి చేస్తుందని అన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు కూలీల జీవనోపాధి మెరుగుపడాలనే లక్ష్యంతో ఈ పనులను ప్రారంభించామని, పనుల అమలులో పారదర్శకత, నాణ్యత, వేగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనులు గ్రామ రూపురేఖలను మార్చేలా చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రజిత, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

20న ఖానాపురంలో
అంగడి ఏర్పాటు సర్వం సిద్ధం

నర్సంపేట ఫిబ్రవరి 10 (నినాదం) : నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మాణం మేరకు ఖానాపురం గ్రామంలో ఈనెల 20 శుక్రవారం అంగడి ఏర్పాటు కోసం సర్పంచ్ దాసరి రమేష్ అద్వర్యంలో పాలకవర్గం గ్రామ ప్రముఖులు గ్రామపంచాయతీకి చెందిన స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీకి సంబంధించిన రామాలయం వీధిలోని ఖాళీ స్థలాన్ని చదును చేసి పేరుకుపోయిన చెత్త,చెదారాన్ని తొలగిస్తున్నారు. గ్రామపంచాయతీకి ఆర్థికంగా వనరులు పెంచే విదంగా అంగడి నిర్వహణకు గ్రామస్తులందరూ సహకారం అందించాలని కోరారు. ప్రతి శుక్రవారం జరిగే అంగడిని గ్రామ ప్రజలు చుట్టూ ప్రక్క గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి రమేష్ కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉప్పు రాజు,వార్డు సభ్యులు వేములపల్లి వెంకట ప్రసాద్ రావు మాజీ సర్పంచులు తక్కలపల్లి రమేష్, పరుచూరి సుబ్బారావు, గ్రామస్తులు మచ్చిక అశోక్ పరుచూరి నరేంద్ర, నెల్లూరీ సాంబశివరావు, మొహినుద్దీన్, మలికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

వెలకట్టలో గ్రామ సభ

సిద్దిపేట ఫిబ్రవరి 10 (నినాదం): కొండపాక మండలం వెలకట్ట గ్రామ సర్పంచ్ బూర్గుల మానస సురేందర్ రావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు త్రాగునీటి కోసం పారిశుద్ధ్య మురికి కాల్వల నిర్మాణం చర్చించారు గ్రామసభ అనంతరం వెలకట్ట గ్రామంలోని మురికి కాల్వల నిర్మాణ పనులు గ్రామ సర్పంచ్ బూర్గుల మానస సురేందర్ రావు వార్డు సభ్యులు ఉపసర్పంచ్ పరశురాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సెక్రెటరీ అంగన్వాడి టీచర్స్ ఆశా వర్కర్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెరుగు తిరుపతి ఇంద్రమ్మ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

స్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేత

దమ్మపేట, ఫిబ్రవరి 10(నినాదం): మండల పరిధిలోని మందలపల్లి గ్రామ పంచాయతీలో హిందువులకు, క్రైస్తవులకు స్మశాన వాటిక స్థలాలు కేటాయించాలని కోరుతూ ప్రకాష్ నగర్ కాలనీ వాసులు మంగళవారం సర్పంచ్ గుజ్జుల శ్రీనివాస్ రావు, ఉపసర్పంచ్ చింతలపాటి మురళి లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మహాదేవ గోపి, 8 వార్డు మెంబరు మనికల సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి కందుల సుబ్బారావు, మాజీ ఆదర్శ రైతు మడిపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నరు.

కెవైసీ అప్డేట్‌తోనే బ్యాంక్ ఖాతాకు పూర్తి రక్ష

సీకేవైసీతో సులభ పరిష్కారం
జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి. రామి రెడ్డి
ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో సైబర్ మోసాలపై హెచ్చరిక

కొత్తగూడెం, ఫిబ్రవరి10(నినాదం) : భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల్లో బ్యాంకింగ్ భద్రతపై అవగాహన పెంచే దిశగా కీలకంగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి. రామి రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా తన కెవైసీ (కెవైసి) అప్డేట్‌గా ఉంచుకోవాలని సూచించారు. ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతాల్లో పేరు, చిరునామా, పుట్టిన తేదీ ఒకే విధంగా ఉండా లని, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం చేయడం చాలా అవసరమని తెలిపారు. కెవైసీ పూర్తి స్థాయిలో ఉండటం వల్ల బ్యాంకింగ్ లావాదేవీలు నిరాటంకంగా కొనసాగడమే కాకుండా మోసాలకు చెక్ పడుతుందని వివరించారు. ఇప్పటికే సెంట్రల్ కెవైసీ (సికెవైసి) వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని, ఒకే బ్యాంకులో కెవైసీ అప్డేట్ చేస్తే మిగతా అన్ని బ్యాంకు ఖాతాలకు కూడా అదే వర్తిస్తుందని చెప్పారు. ఈ ప్రక్రియలో ఖాతాదారుడికి 14 అంకెల సీకేవైసీ నంబర్ జారీ అవుతుందని, ఆ నంబర్‌ను ఇతర బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేస్తే మళ్లీ డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కస్టమర్ రిజిస్టర్డ్ మొబైల్ నుంచి 7799022129కు మిస్డ్ కాల్ ఇస్తే సీకేవైసీ నంబర్‌ను సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు. కెవైసీ పేరుతో ఫోన్ కాల్స్, లింకుల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియనివ్వకూడదని స్పష్టం చేశారు. ఇతరులు తమ ఖాతాను ఉపయోగించేందుకు అనుమతిస్తే, వారు చేసే అక్రమ లావాదేవీలకు ఖాతాదారుడే బాధ్యుడవుతారని, అలా జరిగితే మనీ మ్యూల్గా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని హెచ్చరించారు. తెలియని లింకులు నొక్కొద్దు -- మోసగాళ్లకు చిక్కొద్దు అని ప్రజలకు సూచించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకాలు అతి తక్కువ ప్రీమియంతో అందరికీ భద్రత కల్పించే పథకాలని, ప్రతి కుటుంబం వీటిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. గ్రామ సర్పంచ్ ధరావత్ రామారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివ నారాయణ, సిఎఫ్ఎల్ సుజాతనగర్ కౌన్సిలర్ పవన్ కుమార్, వివిధ శాఖల సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్...

ఒక విద్యార్థికి గాయాలు.. మిగతావారు సురక్షితం...

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10 (నినాదం): జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామ శివారులో మంగళవారం స్కూల్ బస్ ప్రమాదం తృటిలో తప్పింది. ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయే క్రమంలో మెట్‌పల్లికి చెందిన శ్రీ విజయ సాయి సెంట్రల్ హై స్కూల్‌కు చెందిన TG 21 T 1164 నంబరు గల స్కూల్ బస్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్‌లో సుమారు 20 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. బస్ ముందు భాగం అద్దాలు పగలిపోవడంతో ఒక విద్యార్థికి తలకు గాయాలయ్యాయి. కొత్త ధామరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డల స్వామి-- సాహితి దంపతుల కుమారుడు హనీష్ (3వ తరగతి) గాయపడగా, వెంటనే అంబులెన్స్ ద్వారా మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.అదే బస్‌లో ప్రయాణిస్తున్న అతని సోదరి లవాన్ని (2వ తరగతి)తో పాటు మిగతా విద్యార్థులు సురక్షితంగా ఉండటంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.